www.prajasakti.com

# ప్రజాశక్తి

ఆదివారం 9 జూన్ 2024

5

పశ్చిమ గోదావరి

## క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం రాజీనామా

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లులోని శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం రాజీనామా చేసింది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ ఓటమి నేపథ్యంలో ఆలయ పాలకవర్గ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ సారథ్యంలో పాలకవర్గం రాజీనామా లేఖను ఇఒ యర్రా సూర్యనారాయణకు అందించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, మస్కం జగ్గయ్య వారి సత్రం ఛైర్మన్ గంగా పవన్ కూడా తమ రాజీనామా పత్రాలను ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్‌కు అందించారు.



## కౌలు రైతులకు.. రుణార్హత కార్డులేవీ..!

- నేటికీ ప్రారంభం కాని కౌలుకార్డుల జారీ ప్రక్రియ
- ఖరీఫ్ నారుమడులకు రైతులు సన్నద్ధం
- బ్యాంకుల నుంచి పంట రుణాలు అందేనా
- రెండు జిల్లాల్లో 3 లక్షల మంది కౌలురైతులకు అన్యాయం
- కౌలుచట్టంలో కొత్త ప్రభుత్వం మార్పులు తెచ్చేనా?

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

జిల్లా వ్యవసాయ సాగులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలురైతులను ప్రభుత్వం, అధికార యంత్రాంగం గాలికొదిలేసింది. జూన్ రెండో వారంలోకి వచ్చినా ఇప్పటి వరకూ కౌలురైతులకు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించని దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదరణ లేక నలిగిపోతున్న కౌలురైతులకు కార్డులు ఇచ్చే అంశంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ నారుమడులు వేసేందుకు జిల్లా రైతాంగం సన్నద్ధమైంది. మెట్ట ప్రాంతంలో నారుమడులకు సంబంధించి దుక్కులు సైతం జరుగుతున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ చేపట్టకపోవడంపై కౌలురైతుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయసాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం కౌలురైతులను పట్టించుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వం కౌలురైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభించిన పరిస్థితి కొనసాగింది. దీంతో బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని, రైతుభరోసా సొమ్ముగాని, పంట నష్టపరిహారంగాని ఏ ఒక్కటీ కౌలురైతులకు అందకుండాపోయాయి. గడిచిన ఐదేళ్లలో రెండు జిల్లాల్లోనూ అరకొరగానే కౌలుకార్డులు జారీ చేశారు. మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా పట్టుమని లక్షా 50 వేల మందికి కూడా కౌలు కార్డులు మంజూరు చేయలేదు. కౌలుకార్డులు అందుకున్నవారిలో సగం మందికి కూడా బ్యాంకుల నుంచి పంటరుణాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రతియేటా ఏప్రిల్‌లోనే గ్రామసభలు నిర్వహించి కౌలుకార్డులు అందజేత ప్రక్రియ ప్రారంభించేవారు. ఎన్నికల పేరుతో కౌలురైతులను పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి ఉంది. దీంతో జూన్ నెల గడిచిపోతున్నా ఏ ఒక్క కౌలురైతూ కౌలుకార్డు అందుకోలేకపోయారు. కౌలుకార్డులు ఉంటేనే బ్యాంకులు పంటరుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తాయి. లేకపోతే కనీసం పట్టించుకోని పరిస్థితి ఉంటుంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కౌలురైతులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఏర్పడింది. కౌలుకార్డుల జారీ ప్రక్రియపై ఏలూరు వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషాను వివరణ కోరగా టార్గెట్లు నిర్ణయించుకున్నామని, జారీ ప్రక్రియ ప్రారంభించనున్నామని తెలిపారు.

### కౌలుచట్టంలో మార్పులపై తీవ్ర చర్చ

వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతులను దెబ్బకొట్టే కుట్రలకు దిగింది. అందులో భాగంగా 2011 కౌలుచట్టంలో మార్పులు చేసింది. 2019 పంట సాగుదారుని హక్కుచట్టం పేరుతో కొత్త చట్టం తెచ్చింది. ఈ చట్టంలో అత్యంత దారుణమైన మార్పులు చేసింది. పాత చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేయాలని ఉండేది. వైసిపి తెచ్చిన చట్టంలో భూయజమాని అంగీకరిస్తేనే కౌలురైతులకు కౌలుకార్డులు జారీచేయాలని పెట్టారు. ఇది కౌలురైతులకు ఉరితాడుగా మారింది. కౌలురైతులకు కౌలు కార్డులు ఇచ్చేందుకు భూయజమానులు ససేమిరా అంటున్నారు. వారికి అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైన పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఐదేళ్లలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలుకార్డులు కూడా లేకపోవడంతో పండించిన ధాన్యాన్ని సైతం భూయజమాని పేరున అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇది కౌలురైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ నెల 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. కౌలుచట్టంలో టిడిపి కూటమి ప్రభుత్వం మార్పులు తెస్తుందా అనే చర్చ కౌలురైతుల్లో నడుస్తోంది. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీచేసేలా చట్టంలో మార్పులు చేయాలని అంతా కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆ విధంగా చేస్తే కౌలురైతులకు మేలు జరగనుంది. లేకపోతే వైసిపి ప్రభుత్వంలో మాదిరిగానే కౌలురైతులకు ఇబ్బందులు తప్పవని చెప్పొచ్చు.

ఫ్యాక్టరీ ఎదురుగా నిరసిస్తున్న కార్మికులు

## కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల ఆందోళన

**ప్రజాశక్తి - గణపవరం**

మూసివేసిన సిపిఎఫ్ ఫ్యాక్టరీని తెరిచి తమకు న్యాయం చేయాలని కోరుతూ కార్మికులు చేపట్టిన ఆందోళన రెండోరోజు శనివారం కూడా కొనసాగింది. ఫ్యాక్టరీ గేటు వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో కార్మికులు మాట్లాడుతూ నష్టాలు వస్తున్నాయనే సాకుతో ఫ్యాక్టరీని మూసివేయడం తగదన్నారు. 11 సంవత్సరాలుగా సరిపల్లిలో ఉన్న సిపిఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు కనీసం నోటీసులు ఇవ్వకుండా ఆకస్మాత్తుగా ఫ్యాక్టరీ గేట్లకు తాళాలు వేసి మూసివేసిన థాయిలాండ్ యాజమాన్య నిరంకుశ వైఖరిని ఖండిస్తూ నినదించారు. వెంటనే ఫ్యాక్టరీ తెరిపించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంలో జిల్లా లేబర్ అధికారులు జోక్యం చేసుకుని ఫ్యాక్టరీ తెరిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ తెరిచే వరకు విధుల్లోకి తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డి.సాయికృష్ణ, జి.శ్రీనివాసరాజు, ఎస్.ఏసుబాబు, యాసారపు రామకృష్ణ, డి.రాధాకృష్ణ, బి.రాంబాబు, ఎస్.రమణ, మహిళా కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత

**డాక్టర్ బి.సాయి చంద్ర**

**ప్రజాశక్తి - ఉండి**

మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ బి.సాయి చంద్ర అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శనివారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.సాయి చంద్ర ఆధ్వర్యంలో మలేరియాను నిర్మూలించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ర మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మలేరియాను నిర్మూలించాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలని, నీటి నిల్వ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో క్రిమి సంహారక మందులు చల్లాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలన్నారు. దోమలు రాకుండా దోమతెరలను వాడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల మందును పిచికారీ చేయించి పరిసరాలలో కొట్టించాలని రోగులకు జాగ్రత్తలు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తమ సిబ్బంది పర్యటించి ప్రజలకు మలేరియా నివారణపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య విస్తరణ అధికారి ఆర్.కృష్ణ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ

## తీరంలో వర్షం.. ముంపులో ఉప్పమడులు

నీట మునిగిన ఉప్పు మడులు

**ప్రజాశక్తి - నరసాపురం**

తీరప్రాంతంలో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తీరంలోని ఉప్పమడులు నీట మునిగాయి. మండలంలోని పెదమైనవానిలంక, చినమైనవానిలంకలో ప్రతియేటా మే, జూన్ నెలలో ఉప్పు ఉత్పత్తి జరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పుమడులు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుమడులన్నీ పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయాయి. ఇప్పటికే రైతులు పండిన ఉప్పుమడిపై బరకాలు కప్పుకుని భద్రం చేసుకున్నారు. నీట మునిగిన ఉప్పుమడుల్లోని నీటిని మోటార్లతో రైతులు తోడుకుంటున్నారు.

అధ్వానంగా తయారైన రోడ్డు

**మొగల్తూరు:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రహదారి గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు-వెంప, శేరేపాలెం తదితర గ్రామాల్లోని రహదారులపై వర్షపు నీరు నిల్చిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. త్వరలో కొలువుదీరనున్న ప్రభుత్వమైన రహదారుల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ

**ఉండి:** 'సేవలో తరిద్దాం - పేదల బతుకుల్లో వెలుగులు నింపుదాం' అని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లయన్ వేగేశ్న అనంత లక్ష్మి, లయన్ కన్నెగంటి రూత్ కళ అన్నారు. శనివారం ఉండిలోని లయన్ భూపతిరాజు హరనాధ్ రాజు ఇంటి వద్ద పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అనంతలక్ష్మి అధ్యక్షత వహించి ఆమె, రూత్ కళ మాట్లాడుతూ నిరాశ్రయులైన వారికి, నిరుపేదలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ గాదిరాజు రంగరాజులు మాట్లాడుతూ దాతలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, లయన్ సాగిరాజు సాంబశివరాజు, ట్రెజరర్ లయన్ సాగిరాజు సూర్యకుమారి ఆర్థిక సహకారంతో మహిళలకు చీరలు, పురుషులకు ఫ్యాంట్, షర్ట్‌లు ఇవ్వటం అభినందనీయమని, ఎవరికి ఏ అవసరం వచ్చినా ముందుండే వ్యక్తి సాగిరాజు సాంబశివరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు భూపతిరాజు హరనాధ్ రాజు, పాలతీర్థపు నరసింగరావు, బొండాడ కేశవరావు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు డబ్బులు సకాలంలో అందించాలి

**ప్రజాశక్తి - పెంటపాడు**

ఉపాధి కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన కూలీ డబ్బులు రాకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు, చిల్ల పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని ఆకు తీగ పాడులో ఉపాధి కూలీ డబ్బులు ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 కూడా రావడం లేదని ఉపాధి కూలీలు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు ఆకు తీగపాడు ఉపాధి కూలీలను సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకొనగా ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.300 కూడా రావడం లేదని వారు చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు, చిల్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కూలీ డబ్బులు సకాలంలో పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి రమణ, పింకీ సుధారాణి, కొండేటి మేరీ గ్రేట్, పింకీ చిన్నారావు, పొలమాటి బాబ్జి, కటిక దేవుడు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన

పెనుగొండ : మాట్లాడుతున్న షేక్ పాదుషా

**పెనుగొండ:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతనాలు పెంచుతూ రోజుకు రూ.300 చెల్లిస్తామని చెప్పిన విషయం ఆచరణలో అమలు కావడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. శనివారం పెనుగొండ, మునమర్రు రోడ్డులో జరుగుతున్న పనులను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 కూలీ రేట్లు తప్పనిసరిగా అమలు చేయాలని, చేసిన పనికి రూ.260 నుంచి రూ.270 వరకు మాత్రమే చెల్లింపులు జరుగుతున్నాయని, పెంచిన వేతనాలు రూ.300 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట బోదెలలో పనిచేసే సమయంలో సీసా పెంకులు, ఎండిపోయిన కొబ్బరి పుల్లలు గుచ్చుకుని బాధలు పడుతున్నామని వారు తెలిపారన్నారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులను అధికారులు సందర్శించి కూలీల బాధలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఇచ్చిన పనులు కొలత ప్రకారం చేస్తున్నా వేతనాలు సక్రమంగా చెల్లించడంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని కోరారు. పనులు ఇచ్చే విషయంలో కార్మికులను ఇబ్బంది పెట్టే సీనియర్ మెట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## లక్ష్యానికి చేరువగా ధాన్యం సేకరణ

### మండల వ్యవసాయశాఖ అధికారిణి జ్యోషిలా

**పెనుమంట్ర:** మండలంలోని రైతు భరోసా కేంద్రాలు, క్లస్టర్ సెంటర్ల ద్వారా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని స్థానిక వ్యవసాయశాఖ అధికారిణి జ్యోషిలా తెలిపారు. శనివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల లక్ష్యం 41,623 మెట్రిక్ టన్నులు ధాన్యం కాగా చేరువగా సేకరణ జరిగిందని ఆమె అన్నారు. సుమారు 4 వేల 200 మంది రైతులు, కౌలు రైతుల నుంచి సేకరణ జరిగిందని, సహకరించిన అందరికీ ధన్యవాదములు తెలిపారు. ప్రస్తుతం సార్వా వరి సీజన్‌కు పొలాలను వేగవంతంగా సిద్ధం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 72 సార్లు రక్తదానం ఆదర్శనీయం

**ప్రజాశక్తి - నరసాపురం**

రక్తదానంలో భగవాన్ అందరికీ ఆదర్శనీయుడని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ అన్నారు. శనివారం నరసాపురం ప్రభుత్వాసుపత్రిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో 72వ సారి రక్తదానం చేసిన ఆదరణ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ బొడ్డు కృష్ణభగవాన్‌ను సుప్రియ అభినందించి మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి భగవాన్ విధిగా రక్తదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. రక్తదానంపై ప్రతిఒక్కరూ అవగాహన పొందాలన్నారు. చాలామంది రక్తదానం చేస్తే బలం తగ్గిపోతుందని అపోహ పడుతున్నారని, దానం చేసిన రక్తాన్ని వారంరోజులకే పొందగలమన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్నవారు మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చునని సుప్రియ తెలిపారు.



రక్తదానం చేస్తున్న కృష్ణభగవాన్

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

**తణుకు:** రోగులకు తగిన సమయంలో రక్తం అందక మరణాలు సంభవిస్తున్నాయని, అటువంటి వారికి రక్తం అందాలని కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్ అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌లో భద్రపరచి ఎవరికైతే అవసరమోతుందో వారికి తగిన సమయంలో అందించి, రోగుల జీవితాల్లో వెలుగులు నింపడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో రక్తాన్ని దానం చేసినవారు వై.అజయ్, బి.విజయ్, పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

## ప్రొటోకాల్‌కు ప్రాధాన్యతివ్వండి

### అధికారులకు ఎంఎల్‌ఎ పితాని ఆదేశం

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ప్రజల ఓటుహక్కుతో గెలుపొందిన ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అందరికీ ఉందని, పార్టీలు ఏవైనా ప్రొటోకాల్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ సూచించారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన నియోజకవర్గంలోని అధికారులతో ఆయన మాట్లాడారు. నాలుగు మండలాల్లో జెడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు ఛాంబర్లు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. ప్రొటోకాల్ విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విష జ్వరాలు, అంటువ్యాధులపై సర్వేలు చేపట్టాలన్నారు. కొన్ని శాఖల్లో గత ప్రభుత్వంలో చేసిన పనులకు పాత తేదీలు వేసి, ఎం.బుక్ రికార్డ్ చేసి బిల్లుల కోసం ట్రెజరీలకు పంపుతున్నారనే సమాచారం తన వద్ద ఉందని, వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.



## అంతర్మథనం.. అగమ్యగోచరం..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఉమ్మడి జిల్లావాసులను నివ్వెరపర్చాయి. అధికార వైసిపిని టిడిపి కూటమి అన్ని సీట్లలో ఊడ్చేసింది. కనీసం గట్టిపోటీ ఇస్తారనుకున్న సీట్లలో సైతం భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టిడిపి, జనసేన శ్రేణులు సైతం ఫలితాల తీరు చూసి ఆలోచనలో పడ్డారంటే ప్రజలు ఎంత మౌనంగా తమ పని కానిచ్చారనేది అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో వైసిపి అభ్యర్థులు, నేతలు ఫలితాలపై తలలు పట్టుకుంటున్నారు. ఏం జరిగింది, ఎందుకు జరిగింది అంటూ విశ్లేషణల్లో మునిగి తేలుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలను టిడిపి కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అదీ పోలవరం మినహా అన్నిచోట్లా పరిశీలకులు, విజేతలు సైతం ఊహించని మెజార్టీలతో కూటమి విజయ పరంపర సాధించింది. త్వరలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆపై ఎంఎల్‌ఎలు సైతం ప్రమాణస్వీకారం చేయనున్నారు. అదే సమయంలో తమ భవిష్యత్తు ఏమిటని వైసిపి నేతలు అంతర్మథనంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్నంత స్థాయిలో దాడులు, ప్రతిదాడులూ రెండు జిల్లాల్లో చోటుచేసుకోకపోయినా క్యాడర్‌ను నిలబెట్టుకోవడం ఎలాగో అర్థం కాక వైసిపి నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుదామంటే కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలి. అదీగాక ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న మీరేం చేశారని జనం నిలదీస్తే ఉన్న పరువు కూడా గంగ పాలవుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో ఫలితాలపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఎందుకంటే రెండు జిల్లాల్లో స్థానిక సంస్థల పదవుల్లో 70 శాతానికి పైగా వైసిపి నేతలే ఉన్నారు. వారు కూడా ఎన్నికల ముందు స్వపక్షంపైనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేకపోగా ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంతో తాము ఉత్సవ విగ్రహాల్లా మారామని, గ్రామాల్లో ప్రజలకు

ముఖం చూపించలేకపోతున్నామని పలు సందర్భాల్లో వాపోయారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం నిధులిస్తే గ్రామాల్లో పనులు చేపట్టవచ్చునేది వారి అభిప్రాయం. ఎలానూ జన్మభూమి కమిటీల ఆలోచన ఏమీ కన్పించడం లేనందున గ్రామాభివృద్ధే లక్ష్యంగా చేపట్టే పనులకు టిడిపి నేతలు అభ్యంతరం, ఇబ్బంది పెట్టే అవకాశం ఉండదని వారు చెబుతున్నారు. అదే సమయంలో కొంతమంది సర్పంచులు అధికారపక్షంలోకి దూకేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పరిస్థితి తెలియంది కాదు. ఎంఎల్‌ఎలతో సయోధ్య, టిడిపి నేతలతో సమన్వయంతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలనే యోచనలో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు రాజీనామాల బాట పట్టారు. ప్రధానంగా సొసైటీల్లో ఉన్న త్రిసభ్య కమిటీలు, దేవస్థానాల పాలకమండళ్లకు సంబంధించి ఇప్పటికే కొంతమంది తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. అసెంబ్లీ కొలువుదీరేటప్పటికీ ఈ ప్రక్రియ మరింత వేగం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో జనంలో నిలబడి ఈ ఐదేళ్లలో ఎలా పుంజుకోవాలోనని నేతలు అంతర్మథనంలో ఉండగా కేడర్, ప్రధానంగా వాలంటీర్లుగా పని చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని చెప్పవచ్చు. ఏదేమైనా సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో వైసిపి విలవిల్లాడుతుండగా టిడిపి కూటమి నేతలు మాత్రం ఈ విజయాల రికార్డును ఎలా నిలబెట్టుకోవాలి, ఎలా పదిలపర్చుకోవాలనే దానిపై సమాలోచనలు చేస్తుండటం విశేషం. ఏదేమైనా ప్రజల ఆకాంక్షలు నెరవేరిస్తే ఏ నేతకైనా, పార్టీకైనా భవిష్యత్తు ఉంటుంది, లేకపోతే తిరస్కరణ తప్పదని ఈ ఎన్నికల్లో ప్రజలు చాలా నిశబ్ధంగా ఓటుతో చెప్పకనే చెప్పారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

బొలిశెట్టిని అభినందిస్తున్న డిఎస్‌పి

## బొలిశెట్టిని సత్కరించిన డిఎస్‌పి మూర్తి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను డిఎస్‌పి మూర్తి శనివారం జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ డివిజనల్ ఆఫీసర్ డిఎస్‌ఆర్‌విఎస్ మూర్తిని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టౌన్ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, టౌన్ ఎస్ఐ జెబివిఎన్.ప్రసాద్, తాడేపల్లిగూడెం రూరల్ సిఐ ఎ.రమేష్, రూరల్ ఎస్ఐ పి.సురేష్, పెంటపాడు ఎస్ఐ ఎస్.శంకర్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న టిడిపి నేతలు

## పొత్తూరి రామరాజుకు సన్మానం

**ప్రజాశక్తి - నరసాపురం**

టిడిపి కార్యాలయంలో శనివారం నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుకు టిడిపి నాయకులు సన్మానం చేశారు. నరసాపురం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ గెలుపుకు రామరాజు అనవరతంగా కృషి చేశారని ఎలికి చర్ల గ్రామ టిడిపి నాయకులు రామరాజును ప్రశంసించారు. సాలువాతో కప్పి, పూలదండలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల వీరస్వామి, కటకంశెట్టి పెద్దిరాజు, నాగిడి స్టాలిన్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వీర మహిళలు

## జనసేన గెలుపుపై వీర మహిళల సంబరాలు

**ప్రజాశక్తి - నరసాపురం**

పిఠాపురంలో పవన్ కళ్యాణ్, నరసాపురంలో బొమ్మిడి నాయకర్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో వీర మహిళలు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని 26వ వార్డు రుస్తుంబాదలో గంటా కృష్ణ సతీమణి, వీర మహిళ గంటా నాగ దుర్గా దేవి ఆధ్వర్యంలో వీర మహిళలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. అనంతరం వీర మహిళ గంటా నాగ దుర్గా దేవి మాట్లాడుతూ వీర మహిళలందరూ ఇదే స్ఫూర్తితో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులను రాష్ట్ర ప్రజలంతా భారీ మెజారిటీతో ఆదరించారన్నారు. రాబోయే రోజుల్లో నాయకర్, కూటమి నేతల ఆధ్వర్యంలో నరసాపురం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ భారీ గెలుపుతో జన శ్రేణుల్లో నూతన ఉత్సాహం నిండిందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకర్ నాయకత్వంలో పదవుల్లో మహిళలకు పెద్దపీట వేస్తారన్నారు.

## సంపు, ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

### దాతలు ముందుకు రావడం అభినందనీయం : సర్పంచి

**ప్రజాశక్తి - కాళ్ల**

గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు, రూ.35 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమని గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. శనివారం పెదఅమిరం గ్రామంలో సంపు, ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రజల ప్రగతికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ కో ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వీటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం, తాగునీటి అవసరాల నిమిత్తం రూ.35 లక్షల వ్యయంతో నిర్మించే ఫిల్టర్ బెడ్, సంపు నిర్మాణాలు చేపడుతున్నారు. సుమారు 60 వేల లీటర్ల సామర్థ్యంతో సంపు, ఫిల్టర్ బెడ్ల నిర్మాణం జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్, ఉండి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ కోరా రామ్మూర్తి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచి

## నేరాలు - ఘోరాలు

### వ్యక్తి అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

వ్యక్తి అనుమానాస్పద మృతిపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు గ్రామానికి చెందిన వెలిది పాపయ్య(47) నరసాపురం గ్రామీణ మండలం మంగళ గుంట పాలెంలో ఈనెల 6న కూలీ పనికి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా ఆ గ్రామంలోని మురుగు కాలవలో పాపయ్య మృతదేహం లభ్యమైంది. సంఘటనకు సంబంధించి ఆయన భార్య ముత్యావళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# కార్పొరేట్ స్థాయి విద్య అందిచడమే లక్ష్యం

### శ్రీకార్తికేయ జూనియర్ కళాశాల డైరెక్టర్స్ శివ శేఖర్ రాజు, రవికుమార్

**ప్రజాశక్తి - ఆకివీడు**

కార్పొరేట్ విద్యను గ్రామీణ స్థాయి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో అందించడం ద్వారా వారిని ఐఐటి, నీట్‌ల స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా తాము ఈ కళాశాల స్థాపించామని ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ అల్లూరి శివశేఖర్ రాజు తెలిపారు. స్థానిక ప్రముఖులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు ఛైర్మన్‌గా 2018లో కార్తికేయ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించామని కళాశాల మరో డైరెక్టర్ మీసాల రవికుమార్ అన్నారు. ఎంపిసి గ్రూప్ ప్రధానంగా ఈ కళాశాల నిర్వహణ చేపట్టామన్నారు. ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్‌గా ఉన్న శివ శేఖర్ రాజు ప్రజాశక్తితో మాట్లాడుతూ 2018-19 విద్యా సంవత్సరంలో 90 మంది విద్యార్థులతో, 17 మంది సిబ్బందితో తాము ఈ కళాశాలను ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకూ ఆరు బ్యాచుల విద్యార్థులు బయటకు వెళ్లారన్నారు. నాటి నుంచి ప్రతి సంవత్సరం ఎంపిసిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించామని శేఖర్ రాజు వివరించారు. తాము సాధారణ ఇంటర్మీడియట్‌తో పాటు ఎంసెట్, జెఇఇ మెయిన్స్‌లకు కోచింగ్ ఇస్తున్నామన్నారు. అయితే మొదటి సంవత్సరం సిఇసి నామమాత్రంగా ప్రారంభించామని, గత రెండు సంవత్సరాల నుంచి బైపిసి, సిఇసి గ్రూపులు కూడా కొనసాగిస్తున్నామన్నారు. బైపిసిలో ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌ల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారని తెలిపారు. ఎంపిసిలో తమ విద్యార్థులు సాటిలేని అఖండ విజయాలు సాధిస్తున్నారన్నారు. ప్రస్తుతం కళాశాల 400 మంది విద్యార్థులతో, 22 మంది అధ్యాపకులు, సిబ్బందితో పట్టణ, మండల ప్రజల సహకారంతో ముందుకు పయనిస్తున్నామని ఆయన వివరించారు.

కార్తికేయ జూనియర్ కళాశాల



ప్రిన్సిపల్ శేఖర్ రాజు

# అసంపూర్తిగా జాతీయ రహదారి నిర్మాణ పనులు

### వెలవెలబోతున్న దుకాణాలు

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మండల కేంద్రంలో చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొగల్తూరులోని పాతకాలవ సెంటర్ ప్రాంతం నుంచి ఉన్న జాతీయ రహదారి మరమ్మతులకు గురైంది. దానికి అనుసంధానంగా 216 జాతీయ రహదారికి బైపాస్ రోడ్ నిర్మాణం చేశారు. కాళీపట్నం తూర్పులో కూడా గ్రామం నుంచి వెళ్లిన జాతీయ రహదారికి అనుసంధానంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ రెండు రహదారులను తిరిగి ఆర్ అండ్ బి శాఖకు బదిలీ చేసేందుకు వీలుగా రూ.10 కోట్లతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. నెల రోజుల క్రిందట ప్రారంభించినా వేగంగా సాగడం లేదు.

అసంపూర్తి నిర్మాణంలో మొగల్తూరులోని రహదారి

**ప్రజల అవస్థలు..**

గ్రామీణ ప్రాంతాల నుంచి మొగల్తూరు మార్కెట్ ప్రాంతానికి నిత్యం వందలాది మంది ప్రజలు తరలివస్తూ ఉంటారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలందరూ కూడా అసంపూర్తి నిర్మాణ రహదారితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి వెంబడి ప్రజలు, వాహన చోదకులు మార్కెట్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో వ్యాపార సముదాయాలు వెలవెల బోతున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే దుకాణాలు అద్దెలు కట్టేందుకు అప్పులు చేయవలసిన పరిస్థితిలో నెలకొంటాయని వ్యాపార వర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాశక్తి ఆర్ అండ్ బి శాఖ డిఇ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా రహదారి నిర్మాణ పనులు జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారని ఆయన తెలిపారు.

# రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

పాత్రికేయ రంగంపై చెరగని ముద్ర వేసిన ఈనాడు అధినేత రామోజీ రావు లేరనే వార్త ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోందని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. పత్రికారంగం, సినిమారంగం, ఆర్థికరంగం, స్టూడియో నిర్మాణ రంగం, హోటల్ ఇలా అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి రామోజీరావని ఆయన అన్నారు. అనంతరం నివాళులు అర్పించారు. మండలంలోని టిడిపి, జనసేన మండల స్థాయి, గ్రామాల స్థాయి నాయకులు సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు.

తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**ఆచంట:** ఈనాడు అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మృతి రాష్ట్రానికి తీరనిలోటని టిడిపి మండల అధ్యక్షులు కేతా వీరయ్య అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల లేసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినీడి ప్రసాద్, బలుసు శ్రీరామ్మూర్తి, గొడవర్తి శ్రీరాములు, బీరా నరసింహమూర్తి, నెక్కంటి ప్రభాకర్ రావు, సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

**ఉండి:** పత్రికా రంగానికి రామోజీరావు మృతి తీరని లోటని ఉండి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల వెంకట్, ఈతకోట యాకోబు రాజు అన్నారు. శనివారం సాయంత్రం ఉండి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనాడు సంస్థల అధినేత, మీడియా మొఘల్ చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉండి ప్రెస్ క్లబ్ సభ్యులు శేషపు మణికంఠ, జామి అంజిబాబు, కొక్కిరిగడ్డ ఇస్రాయేలు బాబు, బురిడి సురేష్ బాబు, బొండాడ సత్యనారాయణమూర్తి పాల్గొని నివాళులర్పించారు.

తణుకు: నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

**నరసాపురం:** ఈనాడు అధినేత రామోజీరావు మరణం పట్ల నరసాపురం ప్రెస్ క్లబ్ సంతాపం తెలిపింది. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఈనాడు పాత్రికేయులు సిహెచ్. వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామోజీరావుకి సంతాపం తెలిపారు. తొలుతగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించారు.

**తణుకు:** ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మెన్ చెరుకూరి రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన మరణం తెలుగు వారికే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక మందికి తీరని లోటని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు టిడిపి కార్యాయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, నాయకులు చుంచుల వెంకటేశ్వరరావు, కంటిపూడి రాంబాబు, బట్టవిల్లి నాగరాజు, వెంకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** ఈనాడు సంస్థల ద్వారా ఉపాధి కల్పించి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి రామోజీరావుని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. చెరుకూరి రామోజీరావు సంతాప సభ శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరంలో శనివారం నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జిల్లా బిసి సంఘం నాయకులు గంటా త్రిమూర్తులు, జనసేన రాష్ట్ర నాయకులు మల్లినీడి తిరుమలరావు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి బాధాకరమని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. భీమవరం టిడిపి కార్యాలయంలో శనివారం నియోజకవర్గ టిడిపి నాయకుల సమక్షంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి అంగన్వాడీ, డ్వాక్రా సంఘాల ప్రధాని కార్యదర్శి మెరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** చిన్న స్థాయి నుంచి వచ్చి ఈరోజు అనేక వేల మందికి ఉపాధి కల్పిస్తూ, అనేక మంది జీవితాల్లో వెలుగులు చూపించిన మహా నేత రామోజీరావు అని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పాలకొల్లు :** అక్షర యోధుడు రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకే కాదు దేశానికే తీరని లోటని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురి చేసిందని చెప్పారు. హైదరాబాద్ వెళ్లి ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించారు.

నాయకర్‌ను సన్మానిస్తున్న టిడిపి నేతలు

## ఎంఎల్ఎ నాయకర్‌ను కలిసిన పలువురు

**ప్రజాశక్తి - నరసాపురం**

నరసాపురం జనసేన ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆయనకి పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. శనివారం నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ కూటమితో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు అనుభవంతో, పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో రాష్ట్రం, నియోజక వర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వాతాడి ఉమా పాల్గొన్నారు.

## నేడు ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**ఆకివీడు:** నిత్య జీవన సమస్యలను ఎదుర్కొంటున్న సామాన్యులకు చేతనైన మేరకు సమస్యలను పరిష్కరించడం, సహకరించడం లక్ష్యంగా తాము ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నామని ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రకటించింది. పాత, కొత్త ఆదర్శ లయన్స్ క్లబ్ కార్యవర్గాలు స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో శనివారం పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అందరూ మహిళలతో ఏర్పడిన ఆదర్శ క్లబ్‌కు నూతన అధ్యక్షురాలుగా రిటైర్డ్ జెడ్‌పిహెచ్ఎం కాకర్ల రాజరాజేశ్వరి, కార్యదర్శిగా మొరా జ్యోతి, కోశాధికారిగా ఎంవిఎస్ నాగమణి నూతనంగా ఎన్నికైనట్లు క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ క్లబ్ నూతన సమన్వయకర్తగా తాను వ్యవహరిస్తున్నట్లు మోటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నూతన కార్యవర్గం ఈనెల 9వ తేదీ ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ ఆడిటోరియం హాల్‌లో పదవీ ప్రమాణ స్వీకారం చేయనునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రస్తుత కార్యదర్శి, కోశాధికారి ఎం.షరీఫ్, ఎస్‌విజి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు

### వర్షం వస్తే జిగురు మట్టితో వాహనదారులు ఇబ్బంది

**ప్రజాశక్తి - పోడూరు**

మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తిరుగుతున్న మట్టిలోడు ట్రాక్టర్లతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మండల పరిధిలో పెనుమదం, గుమ్మలూరు, వద్దిపర్రు, జిన్నూరు గ్రామాల్లో కొద్దిరోజులుగా మట్టి రవాణా ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతున్నాయి. రెవెన్యూ అధికారులు ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల హడావుడిలో ఉండటంతో నిబంధనలు పాటించకుండా మట్టి రవాణా చేస్తున్న కాంట్రాక్టర్ల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వద్దిపర్రు గ్రామంలో నక్కల మేజర్ డ్రెన్‌పై దాదాపు 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన బలహీనంగా ఉంది. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్లకూడదని ఆర్ అండ్ బి అధికారులు అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయినా సరే వద్దిపర్రు గ్రామం నుంచి టిప్పర్లపై భారీగా మట్టిలోడు వేసుకుని తరలిస్తున్నారు. దీంతో వంతెన మరింత కుంగిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టిప్పర్ లారీలపై, ట్రాక్టర్ల పై భారీ ఎత్తున అధికలోడుతో మట్టి తరలిస్తూ ఉండడంతో అనేక చోట్ల రోడ్లపై మట్టి పెళ్లలు పడుతున్నాయి. మట్టి తరలించే రోడ్లపై ఎక్కడ చూసినా మట్టి పెళ్లలు పడి ఉండడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి చినుకులు పడితే ఈ మట్టి వల్ల రోడ్లు జారుడు బల్లగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ద్విచక్రాలపై వెళ్లే ప్రయాణికులు చెబుతున్నారు. అలాగే చాలా చోట్ల లైసెన్సులు లేని మైనర్లే ట్రాక్టర్లను నడుపుతున్నారు. అయినా రవాణా అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టి తరలించే కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించేలాగా చూడాలనీ, ప్రమాదకర పరిస్థితులను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి..

## అప్రకటిత విద్యుత్ కోతలు

**ప్రజాశక్తి - ఆకివీడు**

మండలంలో అప్రకటిత విద్యుత్ కోత నిరాఘటంగా అమలవుతోంది. అధికారులు విద్యుత్ కోత లేదని చెబుతున్నారు. కానీ ప్రతిరోజు మూడు పూట్ల కోత ఏదో ఒక సమయంలో ఉంటుంది. ముందుగా ప్రకటిస్తే ఆ మేరకు ఇళ్లలోని వారు, మహిళలు సిద్ధపడి ఉంటారు. అందునా మధ్యాహ్నం పూట ఈ విద్యుత్ కోత వల్ల ప్రత్యక్షంగా నరకం చూస్తున్నారు. ఉదయం పూట మంచినీరు సరఫరాకి విద్యుత్ కోత తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. పిల్లలు, వృద్ధులు కరెంట్ లేక నానా యాతన పడుతున్నారు. ఒకపక్క తట్టుకోలేని ఎండ, ఉక్కపోత, మరోపక్క విద్యుత్ కోత ఫ్యాన్ ఉండవు, గాలి ఉండదు, ఇక చెప్పేదేముంది నరకానికి బెత్తెడు దూరంలో ఉన్నట్టే. ఇదిలా ఉండగా మరోపక్క ఉదయాన్నే ప్రభుత్వ కార్యాలయాలకు అవసరాలకు దూరప్రాంతాల వచ్చి వెళ్లే వాళ్లకి ఈ విద్యుత్ కోత తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సాధారణంగా ఇంట్లో ఉండలేని పరిస్థితిలో చదువు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోంది. మరికొద్ది రోజుల్లో గ్రూప్-4 ప్రకటించనున్నారు. నిరుద్యోగులు పూర్తిగా ప్రస్తుతం దానిమీద లక్ష్యంతో ఉన్నారు. వారికి పగలు వేడి, రాత్రి అంధకారం చదువుకునేందుకు టైం లేని పరిస్థితి. విద్యుత్ కోతలు మనిషిని నిలువునా దహించి వేస్తున్నాయి. ఇంకా ఈ కోతలు ఎన్నాళ్లు భరించాలో.

## రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల అత్యవసర సమావేశం వాయిదా

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ఈనెల 9 ఆదివారం విజయవాడలో జరగాల్సిన రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల అత్యవసర సమావేశం వాయిదా వేసినట్టు రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దినపత్రిక ఈనాడు అధినేత రామోజీరావు శనివారం ఉదయం కీర్తిశేషులైనందున వారి సంతాప దినాలు మూడు రోజుల పైబడి ఉంటాయని, పలువురు రామోజీరావు భౌతిక కాయం సందర్శన, నివాళుల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈమేరకు తమ సమావేశం వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. తదుపరి సమావేశం తేదీ ఎప్పుడు అనేది తర్వాత తెలియజేయడం జరుగుతుందని అయన అన్నారు.

## అనాథ పిల్లలకు అమ్మాజ్యోతి ఫౌండేషన్ ఉచిత విద్య

**పెనుమంట్ర:** తల్లిదండ్రులు లేని పిల్లలను హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థ అమ్మాజ్యోతి ఫౌండేషన్ చేర్చుకుంటుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులలో ఒకరు లేకపోయినా, వారు నిరుపేద కుటుంబాలకు చెందిన వారైనా చేర్చుకుని ఇంగ్లీష్ మీడియంలో ఎల్‌కెజి నుంచి పిజి వరకు వారు ఎంత చదివితే అంత చదివించి, ఉన్నత భవిష్యత్తు ఇచ్చే వరకు వారి పూర్తి బాధ్యతలను ఉచితంగా తీసుకుని, మంచి భవిష్యత్ కలిగిస్తుందని పేర్కొన్నారు. పిల్లల గురించి తెలిసిన వారు మానవతా దృక్పథంతో సెల్ ఫోన్ నెంబర్లు 9490043272, 9573411887 నుంచి వివరాలు పొందాలని కోరారు.

## వెంకన్న ఆలయంలో మామిడిపండ్లతో అలంకరణ

**నరసాపురం:** మండలంలోని వేములదీవి వెస్ట్ కాపులకొడపలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా మామిడి కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజాము నుంచే భక్తులు దర్శనానికి తరలి వచ్చారు. కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

## భారీ అన్న సమారాధన

**కాళ్ల:** కోమటిగుంట గ్రామంలో కోదండ రాముల ఆలయంలో స్వామి వారికి 1009 బిందులతో జలాభిషేకం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు కోదండ రాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కెవి ఎల్ సీఫుడ్స్ అధినేత మంతెన నాగాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

## 10న అందుబాటులో ఎంఎల్ఎ పితాని

**పెనుమంట్ర:** ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఈనెల 9 ఆదివారం అందుబాటులో ఉండరని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 10 సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారని, ప్రజలు, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ విషయం గ్రహించాలని పేర్కొన్నారు.

### పేరు మార్పు

నా పేరు గుండుమోగుల లక్ష్మీకృష్ణ రామాంజనేయులు (పాతపేరు), S/o.గోపాల స్వామి (లేటు) డోరునెం.3-30, వల్లూరుపల్లి గ్రామం, పెంటపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నేను నా పేరును గండుమోగుల లక్ష్మీ కృష్ణ తులసీ రామాంజనేయులు (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఇకపై నా పేరు గుండుమోగుల లక్ష్మీ కృష్ణ తులసీ రామాంజనేయులు (కొత్తపేరు) అన్ని ప్రయోజనాల కోసం

### దావా సమను

మహారాజశ్రీ 4వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన) వారి కోర్టులో ఏలూరు (ఎక్సైజ్ కోర్టు)

**O.S.104/2023**

బిట్వీన్ :
తాడాల లక్ష్మీనారాయణ ...వాది
Vs
శ్రీమతి మల్లెమడుగుల మేరమ్మ & 1 అనదరు ...ప్రతివాదులు

2వ ప్రతివాది : మల్లెమడుగుల థామస్, S/o.బాబు, డోరునెం.6-101, శనివారపుపేట, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరు గల దావాలో 2వ ప్రతివాది హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను **ది.26-06-2024**కు వాయిదా వేసినారు. కాబట్టి 2వ ప్రతివాది పై నెంబరు దావాలో **26-6-2024** తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 2వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు గల దావాను శ్రీకోర్టు వారు తీర్మానించెదరు అని తెల్పడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
**శేశెట్టి అప్పారావు**
ఏలూరు అడ్వకేటు
తేది.08.06.2024 సెల్: 8341885888

### దేవాదాయ ధర్మాదాయ శాఖ

**భూములు కౌలుకు హక్కునకు టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన**

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు పట్టణం శ్రీ తుమ్మలపల్లి కృష్ణ మూర్తి విశ్రాంతి భవనమునకు, అత్తిలి మండలం, వరిఘేడు గ్రామంలో సంపూర్ణ హక్కు భుక్తములో వివిధ ఆర్ఎస్. నెం.లలోని య.22.02 సెంట్లు వ్యవసాయ భూమిని 9 ప్రతులుగా 3 సంవత్సరములకు అనగా **2024-2025 సం.రం నుండి 2026-2027 సం.రం వరకు** గల కాలపరిమితికి కౌలు హక్కు అనుభవించుటకు గాను **ది.20.06.2024 వ తేది గురువారం ఉదయం గం.11.00 లకు** తణుకు దేవాదాయ శాఖ, ఇన్‌స్పెక్టర్ వారి సమక్షములో వరిఘేడు గ్రామములో వేంచేసి యున్న **శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయము** నందు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. ప్రతి పాటదారుడు ఆయా ప్రతులకు నిర్ణయించబడిన ధరావత్తు చెల్లించి సదరు టెండర్ కం బహిరంగ వేలములో పాల్గొనవలసినదిగా కోరడమైనది. పాట షరతులు పూర్తి వివరములు పాటకు ముందు చదివి వినిపించబడును. లేదా సత్రము భవనము కార్యాలయము నందు సంప్రదించవలెను.
NB : ఏ కారణము తెలుపక కౌలు హక్కు వేలం వాయిదా వేయుటకు FFM మరియు అధికారులకు సర్వ అధికారములు గలవు.

తేది.08.06.2024
తణుకు

F.F.M
సం/- T.N.S.V.S కృష్ణ మూర్తి
ఫోన్ : 94906 76903